# దత్తు

అన్నము లేకపోవుట ఒక లోప మని ఒప్పుకొందును, వస్త్రము లేకపోవుట ఒక లోపమని అంగీకరింతును. మగఁడు లేకపోవుటయు ఒక లోప మని ఇయ్యకొందును. కాని పిల్లలు లేకపోవుట ఒక లోపమా? మేనక పిల్లలు లేకపోవుట ఒక లోపముగా భావించుకొనును. ఇంతయుకాక పయిగా గునుపు.

'ఇది నిక్కముగా లోపమేనా?' అని ఎన్నాళ్లాలోచించినను నాకు తెగలేదు. పిల్లలు లేకపోవుటొక లోపమా యనియు పిల్ల లుండుట లోపపూరణమా యనియు నేను తఱచి తఱచి యడుగుచో మేనక గుడ్లప్పగించి ఊరకుండెడిది. ఈవిషయము నింకను వారిని వీరిని అడుగవలయునని నాకుండెడిది.

బ్రహ్మానందము నా కెంత మిత్రమో అతని భార్య విద్యావతియు అంత మిత్రము. ఆమె నిక్కముగా విద్యావతి. దాన నామెను మా యూరి యాఁడువా రెల్లరును మగవానిగా భావింతురు. ఆమె నటులు మగవానిగా భావించువారిలోఁగల ఉత్తమగుణములు విద్యావతిలో లేవు. మగవారు రాఁగానే లేచి తలుపు చాటుచేసికొని యామె మాటాడదు. ఆమె నేలచూపులు చూడదు. ఆమె నిర్భయముగా చూచును. ప్రాణి ప్రాణితో మాటలాడినటులు మాటలాడును. ఆమె లోపల ఎంతో బయటికిని అంతే. బయటికి ఎంతో లోపలను అంతే.

'విద్యావతీ! పిల్లలు లేకపోవుటకూడ ఒక లోపమని అనిపించునా? అనిపించెనేని అది ఎట్టి లోపము?' అని ఒకనాఁడు నే నడిగితిని. కూడ? ఈ 'కూడ' స్త్రీ జాతికి అగౌరవము. నిక్కముగా నీమీఁద మాననాశమునకు దావా తేవచ్చును. కాని మగవాండ్రే జడ్జీలుగా ఉన్న యీ కోర్టులలో న్యాయము కలుగుట కల్ల కావున ఆమాట అటుండనీ! నే నొక సంగతి అడిగెదను, దానికి సమాధానము చెప్పు. 'భార్య లేకపోవుట పురుషునకు లోపమేనా?' అని విద్యావతి ఎదురు ప్రశ్న వేసెను.

నాకు పదవయేట పెండ్లిచేసిరి. పదునేడవయేట మేనకను నాకడ కంపిరి. ఈ సంగతి నాకు తుట్టమర తెలియదు, కాన వెఱ్ఱిమొగము వేసికొని కూర్చుంటిని.

'మాటలాడ వేమి? అవును; నీకాలోపము తెలియదు. నీ వాఁడుదానవయి యున్నపుడు నిన్ను ఒక మగవానిని జేసిరి, సరేకాని మావారి నడుగుచో 'తూ చా'లతో తెలియును. వారికి పాతికఏండ్లు వచ్చుదనుక పెండ్లి కాలేదు, వారికిఁగల మూఁడువేల రూకల ఆస్తిని అమ్మి నన్ను చేసికొనిరి. ఇది నానోట వాటముగా నుండదు. వారిముఖముననే వినవలయును. సరి; అప్పటి నుండియే నన్ను తమయింటికి బంధించుకొని వెళ్లుటకు జాబులు, ఇఁక నేను పెద్దదానసయిన తరువాతి ముచ్చటలు వారే చెప్పవలయును' అని యిటులు విద్యావతి అనుచుండఁగా బ్రహ్మానందము ముసిముసినగవలతో గదిలో నుండి వీధిలోని కొకటే అంగ పెట్టెను.

విద్యావతి వెంటనే - 'తమ సంగతియే, ఇటు దయచేయుఁ డిటు దయ చేయుఁ' దని అనుచుండఁగనే బ్రహ్మానంద మంతర్ధానము చేసెను. వారాదారినే కోర్టుకు పోయి ఆఁడువారిమీఁద డిఫమేషన్ తెచ్చునటు లున్నారు' అని విద్యావతి అనెను.

నాకును కష్టముగనే ఉన్నది. నాకిపుడు బ్రహ్మానందము మీఁద అనుతాపము కలిగెను. 'నేను బ్రహ్మానందమును తీసికొని వత్తు' నని మిషపెట్టి పోఁదలఁచితిని గాని విద్యావతి వెంటనే 'మహాశయా! 'పిల్లలు లేకపోవుట లోపమా?' అను ఈ ప్రశ్న - 'అది లోప మగుచో ఎట్టి లోపము?' అను ఈ ప్రశ్న, నన్నడుగుటకు వచ్చితివా? ఆఁగు ఆఁగు అక్కడనే ఉండు' అని లోపలికి వెళ్లి దొడ్డిదారిని వచ్చిన మేనకచేయి పట్టుకొని నాయెదుటికి తీసికొనివచ్చి - 'ఇదిగో! ఈమె నడుగు' మని అనెను.

మేనక నా ప్రశ్నకు కనులతో నిరీక్షించుచుండెను. దాన నామె యిపుడే వచ్చెనని గ్రహించితిని. నాకు కొంచెము ధైర్యము కలిగెను. పిల్లలు లేకపోవుట లోపమే కాఁబోలు నని అనుకొంటిని. లోఁగడనే తెలిసికొనలేక పోవుటయు విశేషించి నాయంత నేను తెలిసికొనలేకపోవుటయు ఇది యెల్లయు నాలోప మనియే భావించి విద్యావతి నామీఁది ఉత్తరీయమును లాగుకొనుచున్నను బయటఁబడి ఎంత వేగముగా ఇంటికి జేరవచ్చితినో ఆ దైవమునకే ఎఱుక!

## 2

విద్యావతి మేనకకు మా సంభాషణ మంతయు తప్పక చెప్పునని నిర్ధారించు కొంటిని. గదితలుపు బిగించుకొని కూర్చుండి ఆలోచించి యిటులు రూఢిపరచుకొంటిని- 'ఈ సంగతి పిల్లలఁగనువారికే తెలియవలయుఁగాని మగవారి కెటులు తెలియఁగలదు?' అని. ఇటులు నిశ్చయించుకొని నా యీ నిశ్చయమును మేనక కెఱుంగనటులు వినిపించుచో నామెకు చాల ఓదార్పుగా నుండునని అనుకొని ఒకటి రెండు సారులు

నాలో నేనే లోపల ననుకొనినటులును బయటికి అనుకొనినటులను అనుకొంటిని. మేనక నాకుప్రత్యుత్తరముగా సరిగా నావలెనే – 'భగవంతుఁడీ భారము మగవారికే పెట్టినచో అప్పు డొరులు చెప్పఁబనిలేదు' అని అనుకొనెను. 'స్త్రీజాతి కోపము శాపముగా పని చేయునేమోరా భగవంతుడా' అని నే ననుకొంటిని. అంతట నిఁక దత్తు చేసికొని తీఱవలయు నని తలఁచితిని. మగవానిని చేసికొందమని నేను; ఆఁడుదానిని చేసికొందమని మేనక.

కుఱ్ఱని పెంచుకొనుచో వార్ధక్యమున నక్కఱవచ్చుట యొకటి, చనిపోయినపిదప పితృమేధము చేయుట రెండు, ప్రకృతలోపమును లేకుండఁజేయుట మూఁడు, ఈ మొదలుగా పురుషదత్తతలోఁ గల గుణములను మేనకకు వివరించితిని.

వార్ధక్యమున వాకిటికి లాగుట యొకటి, ఏ బస్తీకో పోయి కొన్నాళ్లకు తిరిగివచ్చి అచట తద్దినము పెట్టితి నని అపలపించుట రెండు, ఈ రీతిగా ప్రకృతలోపమును ద్విగుణీకృతము చేయుట మూఁడు అని యీఁక కీఁక తోఁకకు తోఁక తీసి ధనాశచే అల్లుఁ డక్రీతదాసుఁ డగు టొకటి, కూఁతుతో కలిసి ఒకరికిద్ద అక్కఱకు వచ్చుట రెండు, కొడుకు గోడం డ్రెంత విరోధింతురో అల్లుగూఁతు లంత ప్రేమించుట మూఁడు, అని స్త్రీ దత్తతను గుఱించి మేనక ఉపన్యసించెడిది.

నా కెపుడును వేదాంతములు చదివికొనుటయే పని. అష్టదిగ్బంధనములతో అంగరక్షతో అప్పసము ఒక గదిలో కూర్చుండువాఁడును. మాయింటి నిశ్శబ్దతను ఆకాశముగాని వాయువుగాని భగ్నము చేయలేకపోయెడివి.

గుహాగంభీరమయిన మాగృహ మిపుడు క్రమక్రమముగా సహస్రకంఠములతో ముఖరితము కాఁదొడఁగెను. ఇంటఁగల, ప్రతిపదార్థము క్రిందనో మీఁదనో పడి తన యునికిని ఖంగున చెప్పుచుండెను. లోఁగడ నెన్నఁడును లేని యీ శబ్దము నా కచ్చెరువుగ నుండెను. చాల కాలమునుండియు మాటయు పలుకును లేని ఆ శూన్యారణ్యము ఇపుడు వడ్డితోఁగూడ అప్పును టకాయించి వసూలు చేసికొనుచున్నదా?

నా గదితలుపులు మెలమెల్లగా తీసి రెండడుగులు వయిచి చూచితిని, మేనక యొడిలో దుర్గ కుస్తీపట్టుచున్నది. నన్ను జూచి మెఱుపు తగిలినటులు ముణుచుకొనిపోయి మఱి మాటాడలేదు. మరల మాయింట శాంతి.

దుర్గ బిడయపడుట కాదుగాని భయపడిన దనియే యనవలయును. శుష్క వేదాంతపఠనమువలనఁ గలిగిన నా యుదాసీనత యంతయు నపుడాబాలికవల్ల మట్టిలోఁ గలిసిపోయెను. 'దుర్గా! అన్నము తిన్నావా?' అని నేనడుగఁగా, దుర్గ మూసికొన్న

చేతులవ్రేళ్ల నెడముచేసి కాటుకకన్నులతో నన్ను జూచెను. దుర్గయీనాఁడీరీతిగా వ్రేళ్లసందులనుండి దోబూచులాడిన పిదప నేఁటి కిది ప్రథమపాఠ మని అనుకొని నేను మరల నాగదితలుపులు మూసికొంటిని, మూసికొనిన వెంటనే కందిరీఁగలపట్టు కదిలెను– 'పిన్నీ! ఆయన ఎవరు? ఆయన నీకే మౌను?' అని దుర్గ ప్రశ్నించెను. మేనక నవ్వెను. 'మా అమ్మకు మానాన్న ఔనా?' అని దుర్గ ప్రశ్నపరంపరను శరపరంపరగా పరఁగించెను.

## 3

నాకు పిల్లలనినచో ఇష్టం. బహు ఇష్టమే కాని నాకే పిల్లలుండుట అనునది అనిష్టము, మహా అనిష్టము. ఒకవేళ నాకే ఉండుచో ఈ చెప్పఁబోవు నియమములతో వారిని ఉంచుకొనుటలో ఏమియు ఆతంకము లేదు.

ఏడువఁగూడదు. లోలోపలఁగూడ ఏడ్వఁగూడదు. అట్లని ముదిమోములతో కూర్చుండరాదు. కలకలలాడుచు నవ్వుచుండవలయును. ఎత్తుకొమ్మని యేడువఁ గూడదు. ఒకవేళ యెత్తుకొని వెంటనే దింపినచో దిగక చంకనంటుకొని లబలబ లాడరాదు. వెంటనే నగుమోముతో దిగిపోవలయును. పప్పులు పెట్టుమని, బిళ్లలు పెట్టమని వేధింపరాదు. శరీరధారణకు మాత్రమే ఆహారమని తెలిసికొనవలెను. పెట్టినది గుటుక్కున మ్రింగి గప్‌చిప్ మని నోరు మూసికొనవలెను. వారి ముక్కు నోరు మొదగునవి నిత్య నిర్మలములుగా ఉండవలయును. నా కోరికి చొప్పున వారికి నిద్ర రావలయును. ఆఁకలి కావలయును. నా కాగితములు చింపరాదు. వానిమీఁద వ్రాయరాదు. సిరా పోయరాదు. విశేషించి మా యింటి నిశ్శబ్దతను బహుభద్రముగా కాపాడవలయును. ఇట్టివింకను....

అన్నము తినువేళ పిల్లలు ఏడ్చుచో అది నాకు జీర్ణము కాదు. నా సంగతి తెలిసిన తల్లులు వారిని చాటులకు తీసికొని వెళ్లి నోరు మూసి వినఁబడని దెబ్బలు కొట్టుచో తొడపాసెము పెట్టుచో, నేను మెలకువగా తెలిసికొని – 'తల్లులు చక్కగా కందురు కాని మరల వారే చంపివైతురు' అని అనువాఁడను.

నా యుద్దేశమున పిల్లలు ఏడువకుండ ఉండవలయు ననున దొకటి. వారికి మాటలురావు. కావున తమ దప్పులు తెలుపుకొనుటకు ఏడ్తురను అంశము శుష్కవేదాంత పఠనముమానిన పిదప నిన్న మొన్ననే తెలిసెను. అల్లరి మానవలయు ననునది ఇంకొకటి. 'మనస్సు గాలివలె పట్టరానిది. దానిని నిగ్రహింపవలెను. అని మాటి మాటికి చెప్పు గీతావాక్యములు పిల్లలను గుఱించినవే' అని నా తలఁపు. కాని, నా మనస్సును నేను చూచుకొన్న తరువాత నేనే మిథ్యాచారుఁడని తెలిసికొంటిని. పెద్దలను గౌరవింపరనునది

మఱియొకటి. ఎంతవారి నైనను 'నీవు నీవు' అని అనివేయుదురు; విశేషించి నన్నుఁ గూడ. ఇప్పుడు దుర్గ నన్ను 'ఏమండీ' అనిపిలుచుచో 'ఏమిరా' అయిపోయెను.

ఇటీవల ప్రతిదినము ప్రక్కబక్కల పటహధ్వనులలో మెలఁగుట నాకు అలవాటు కాఁజొచ్చెను. క్రమక్రమముగా నాయెదుటనే తప్పెటలు తాళములును.

## 4

సమయమునకు దుర్గ రానిచో ఇపుడు నేనే పిలుచుచుంటిని.

ఒకనాఁడు తండ్రి చూచుచున్నాఁడని కాఁబోలు, దుర్గ నా చేయినలిగిన పూవువలె వదిలివైచి ప్రక్కసందులోనికి తప్పుకొనెను. మఱొకనాఁడు 'ఒకనాఁడు చూచెఁగదా!' అని కాఁబోలు, చేయిమాత్రం వదిలి నాతో వచ్చెను. ఇంకొక నాఁడు తండ్రి చూపులతో కంటకిత యయినను నాచేయి వదలకయే నాతో వచ్చెను, నేను కాఫీ పుచ్చుకొనుటకు కూరుచుంటిని. దుర్గ దూరముగా నిలువఁబడి అదే పనిగా చూచుచుండెను. అల్లరిపిల్ల చేతిలో గిన్నెను ఎగురఁగొట్టు నేమో యని భద్రముగా పట్టుకొనియుంటిని.

దుర్గ 'అదేమిటి?' అని అడిగెను. 'కాఫీ' అంటిని 'కాఫీ రాసుకుంటారుగాని తాగుతారా?' అనెను. ఇది 'తాగే కాఫీ' అని ఉదాహరణము చూపుచుంటిని. దుర్గ మఱికొంచెము దూరము జరిగి నిలువఁబడెను. అడుగునా? యని కనిపెట్టుకొని కూర్చుంటిని. ఊరక చూచునే కాని అడుగదు.

'కొంచెము కాఫీ పుచ్చుకొందువా?' అని నేనే అడిగితిని. పిల్లల భాషలో 'అదేమిటి?' అనుదానికి 'అది కావలయును' అను అర్థము నా కపుడు గోచరించెను. గిన్నె చేతి కందించితిని. 'నాన్న కోపంచేస్తాఁడేమో' అన్నది దుర్గ.

నాకు కొంచెము ఆలోచనకు అవకాశము. పరులము కాఁబట్టికదా ఈ పిల్లగూడ ఇటులు అనుచున్నదని నాకు అపుడు విషాదము కలిగెను. నన్ను అర్థం చేసికొనెఁ గాఁబోలు, మేనక నాకన్నులకేసి చూచెను. మేనక మనస్సు నాకు తెలిసెను. నా మనస్సు మేనకకు తెలిసెను. మనస్సంతయు ఒకటేజాతికదా. మేనక కన్నీళ్లతో పెరటిలోనికి వెళ్లెను.

దుర్గచేతిలో గిన్నె ఆ రీతినే ఉండెను. 'ఇక్కడికి వచ్చావని మీ నాన్న కెట్లా తెలుస్తుంది లే!' అని నే నంటిని. 'వాళ్లింటికి ఎందుకెళ్లావ్' అని నిన్న అడగలా?' అన్నది దుర్గ.

నాకు కొంచెం ఆలోచన అంకురించెఁ గాని ఇట్టే తుంపివైచితిని.

'కాఫీ చల్లారితే బావుండదు. తరువాత ఆ సంగతి ఆలోచిద్దాం. ముందర కాఫీ తాగు!' అంటిని. నిజమే అని అనుకొనుచు దుర్గ కాఫీగిన్నె ఒక్కసారి ఎత్తి నోటిలో పోసి కొనెను. కాఫీ ముక్కులలో నిండఁగా కన్నులలో కొంత, కన్నులు నిండఁగా చెవులలో

కొంత సర్దుకొనెను. దుర్గ ఒక్కసారిగా ఉక్కిరి బిక్కిరి అయెను. మేనక చరాలున వచ్చి దుర్గను ఎత్తుకొని దగ్గించి తుమ్మించి తానుగూడ కొంత గడబిడ ఆరోపించుకొనెను. దగ్గులు తుమ్ములు అయిన తరువాత దుర్గ 'నా కింక కాఫీ అక్కఱలేదు' అని యనెను.

ఆ మఱుసటినాఁడు దుర్గ రాకపోవఁగా చాలసేపెదురు చూచితిని. చూచి చూచి వారియింటికే వెళ్లితిని. దుర్గతండ్రి వాకిట కూర్చుండి యుండెను.

ఒక మనుష్యుడు మఱియొక మనుష్యుని చూచినంత మాత్రమున మాటాడవలసిన విధి యెచటను లేదు.కాని ఎదురుగా కూర్చుండి ముఖము కేసి చూచుచుండుచో అతఁడు వెనుజూపు పెట్టునేని ఇఁక మాటలాడుట యెట్లు? పాఱిపోవు కోయిలను వెంటాడి పలుకరింతుము; ఎదురుగా నున్నను అప్రసన్నునితో మాటలాడఁ జాలము. తీరమున నిలిచి సాగరమును పిలిచితి మేని సహస్రకంఠములతో 'ఓ' యనును. అక్కఱలేనిదే అతిగంభీరముగ కూర్చున్న మానవునితో మాటాడఁగలుగుట అరిది.

నేనొక వాత్సల్యదైవమును అతని దేవాలయమున చూడఁదలఁచికొని వెళ్లితిని. కాని తలుపులకు తాళాలు.

నేనే మెల్లగా తలుపు తెఱచికొన ప్రయత్నించితిని. ఏనుఁగు బలముతోఁగాని ఆ తలుపు కొంచెమేనియు కదలలేదు.

నా చెప్పిన దెల్లయు ఆలించి ఆయన 'మా అమ్మాయి అసలే వదర. మీరు దానినీ మఱీ కొంచెము వాగించుచున్నారు! ఇది అతి పరిచయ మనుకొందును' అని అనెను.

నాయంత నేను త్రోసిన తలుపు బఱ్ఱుమని నామీఁదనే పడెను. నా వేదాంతమపుడు నాకు లెస్సగా ఉపయోగించెను. గతవిషయ మఖిలము మేనకతో చెప్పికొంటిని. నా విషాదము కూడ అమె అనుభవించెను.

ఇదివఱకు మాయింటికి అలంకారప్రాయముగా ఉన్న మౌనము ఇపుడు భీకరముగా ఉండెను. ఇపుడు మాయింట నందికేశ్వరుఁడు పటహములు వాయింపఁడు. భృంగి హాస్యములు చెప్పఁడు. కౌమారి ముద్దుమాటలు అనదు. దుర్గ నర్తింపదు. ఇల్లిపుడు గొడ్డువోయెను.

మఱల ఎప్పటి ఆట. నావేదాంతములూ నేనూ. కొన్ని మాసములు కడచెను. మేనక 'మా దుర్గ తపస్సు చేసికొనుచున్న'దని కలవరించెడిది.

## 5

మా వీధిలో పేరంటం. ఇపుడు పొరుగింటికిగూడ అడుగు పెట్టని మేనక పిలువని పేరంటమునకు వెళ్లెను. మంగళ ధ్వనులతో చెవులు చిల్లులువోయెను. నాకు దుర్గ గుఱుతు

తగిలెను. వెంటనే ప్రాంతకోంతలు కట్టిపెట్టి దుర్గను తలపోసికొనుచుంటిని. 'పేరంటమునకు వెళ్లుచో దుర్గ కనంబడునుగదా' అని అనుకొంటిని. నాకు స్త్రీలమీందం గల చులకందన మిపుడు పోయెను, ఇంట నే నొక్కండనే. నా మనస్సున ఒక్క దుర్గయే. ఈ దుర్గ వెనుకటి దుర్గ కాదు. ఒక కోరచూపు బెత్తముచే నా బాహుపంజరములోనికి వచ్చుటకు భయపడు దుర్గ!

కొంతసేపటికి నాగది తలపులమీంద ఒక మృదుస్పర్శ కలిగెను. నా హృదయ పద్మము మీంద ఒక అశాభృంగము వాలెను. 'బాబా' అని పిలుపు.నా ఒడలు గగురు పొడిచెను.

మఱల బాబా అనిపిలుపు.నేను మాటాడలేదు.దుర్గ బిగ్గఱగా అఱచెను. వెఱ్ఱికేకలు వేసెను. పేరంటమునకు వెళ్లక పొరుగున నెవరేని ఉన్నయెడల లోపల ఉన్నవాండు ఏకారణముననో ఈ పాటికి అయిపోయి ఉండునని తలుపుల ఉతకలు ఎత్తి పాఱవైచి యుందురు. దుర్గ పిల్లయగుటచే లోపల నేను గట్టిగా బ్రదికి ఉన్నాననియే, తనను పరీక్షించుటకో నిషేధించుటకో తలుపు తీయలేదనియే.

నేను మాత్రం తలుపు తీయలేదు. పర్వతరాజ శాస్త్రుల్లుగారూ! అని ఋషభ స్వరములో, పర్వతరాజు గారూ! అని గాంధారములో, పర్వతాలూ! అని మధ్యమములో, రాజా! అని పంచములో, పర్వతరాజా! అని ధైవతములో, బాబా! అని విషాదములో, ఈ స్వరములన్నియు నా మనోద్వారమును తెఱచెను గాని తలుపు మాత్రం తెఱవలేదు.

ఇంక ఒకటే స్వరము మిగిలెను. అది ప్రేమస్వరమునకు అపరాంగమయిన రోదనస్వరం. ఆ స్వరముతో 'కొంచెం తలుపు తెఱవవయ్యా! ఒక్కసారి చూచి పోతానయ్యా! ఎంతోసేపు కూచోనయ్యా!' అని దుర్గ అనెను.

నా పరీక్ష కడముట్టెను. ఇంతకు ముందే మేనక దొడ్డిదారిని లోనికి వచ్చి ఇదియంతయు ఆలకించుట నే నెఱుంగను.

మెల్లగా గడియ తీసితిని. నేను ఏమాత్రము భద్రముగా నిలుచుండకపోయినను తలుపులు రెండును నామీంద విసురుగా పడునవే. దుర్గ ఎగిరి తనంతట తాను నాకు దత్తు అయినట్లు ఒక్కసారి నా కంఠము కౌంగిలించుకొనెను. ఆహా! సంతానవంతు లెంత భాగ్యవంతులో! నా కపుడు ఒకానొక ఆనందము కన్నులలో భాష్పధారలుగా పరివర్తితమాయెను. కంఠమున వెక్కులుగా పరిణమించెను. నన్ను చూచి దుర్గ ఆవురు మనెను.

మా కన్నీరు ఆఁపుటకు గాఁబోలు మాముందు దుర్గ తండ్రి నిలువఁబడి యుండెను.

దుర్గ ఒకతూరి వెనుదిరిగి చూచెను. తొడిమె ఊడిన పూవు. నాసందిటనుండి మధుబిందువువలె నేలకు జాఱెను.

నేను దుర్గ తండ్రికేసి కోరచూపులు చూచుచు నిలువఁబడితిని. దుర్గ శిక్షిత హరిణివలె ముందులకు నడచెను; తండ్రి వెనుక ముఖరమయిన వీణ గవుసెనలో నడచిపోయెను.

మేనకకును నాకును కొన్నాళ్లు వెన్నెలలేదు. మాకేదో తప్పుచేసినటు లుండెను. మఱచిపోయిన మౌనమును మా యిల్లు క్రమ్మర అలవఱించికొనెను.

పదినాళ్ల పదంపడి మాయావేదాంతము మాని భక్తి వేదాంతములు చదివితిని. అన్ని దేశములవారి భక్తిని తఱచితిని. భక్తి భరతఖండము సొమ్ము.

తొల్లి అన్నింటికంటె జ్ఞానమే ప్రధానమని నా వాదము. ఇపుడు ఆ స్థానమును భక్తి ఆక్రమించెను. పండితులతో వాదించుటకుఁ గాదు – ఉపలబ్ధికి వాదింప దలచినచో – తదేవ కర్మజ్ఞాని యోగిభ్య అధిక్య శబ్దాత్ అను శాండిల్యుని భక్తి మీమాంసలో పండితులకు రంగస్థలము దొరకును.

భక్తిలో పడితిని. ప్రతిబిచ్చగానిపాటలో కవిత్వమే. వ్యాకరణాది దోషములు పాపములవలె మనస్సునకు తట్టుట లేదు. సంగీతశాస్త్రముతో పనిలేదు. భక్తిరసముకల ఆ పాట సుందరం.

తెల్లవారుజామున మా యింటి ప్రక్క పూర్ణమ్మగారు, -

కృష్ణమ్మా! గోపాలబాలా! కృష్ణమ్మా!
కాళ్లాకు గజ్జెలు గట్టి
వేళ్లా కుంగ్రాలు పెట్టి
గోళ్లాకు ఎఱుపులు తిరుగ –
గోరింతాకు పెట్టెద రారా – కృష్ణమ్మా!

అని పాడుచుండెను.

ఈ పాట వినుటతోడనే శ్రీకృష్ణుని ఆమె దత్తు చేసికొనె నని తోచెను. ఆ మఱునాఁడు వంగీయుల దుర్గాపూజ చదివితిని. వారు దుర్గను కూఁతుగా తమ పుట్టింటికి తెచ్చి పూజించి కొందురు. బలే.

నేను బంగారము తెచ్చి మేనకకు ఇచ్చితిని. మేనక దుర్గాప్రతిమ చేయించెను.

ఇపుడు అనునిమిషము మా దత్తకుమారి మమ్ము వదలినను మేము వదలము.

ఇంకొక మాఱుపు. నా నియమము లన్నియు ఇపుడు తలక్రిందులాయెను. ఇపుడు నేను మా దుర్గను 'నవ్వవేమి' అని అందును. 'అది పెట్టు; ఇది పెట్టు' అని అడుగవేమి? అనియేడ్తును. నా కాకితములు చింపవేమి? ఇల్లంతయు మోఁగి పోవునటులు నృత్యము చేయవేమి? అని బతిమాలుకొందును. నీవు పలికినదాఁక అన్నము తిన నని పట్టుపట్టి ముక్కు మూసికొని కూరుచుండుచుందును. గుండులు నీరుగా నర్తింతును చూపులోని కేఁగఁగా మాయమ్మను జూతును.

● *భారతి - ఏప్రెల్ - 1928* ●